ప్రేమపాశం

పండిత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

మొదటి అంకం

మొదటి రంగం

[రాజమహేంద్రవరం, ఇన్నిసుపేటలో స్వగృహమున, వీధి అరుగుమీద మెట్లమీదకి కాళ్లు వుంచుకొని వెంకటశాస్త్రి వొకపక్కనీ, కాంతమ్మ వొకపక్కనీ కూచుని వుంటారు. బంగారమ్మ తండ్రి వొడిలో వుంటుంది.]

బంగారమ్మ —చదువు మరిచిపోలేదు నాన్నా! మేష్టారు అప్పుడే పాఠం చెప్పేసి వెళ్లిపోయారు. వెంకమ్మత్తగారు పిలవగా మాఅమ్మ అప్పుడే పని ముగించుకొని యివతలికి వచ్చింది. ముగ్గురమూ గవ్వలాడుకుందామని కూచున్నాం.

వెంకటశాస్త్రి — ఎవరు పురమాయించారు తల్లీ గవ్వలాటా?

బంగారమ్మ — అత్తగారే. ఉండు నాన్నా! చెప్పేదంతా విను.

వెంకటశాస్త్రి — చెప్పుచెప్పు.

బంగారమ్మ—మా అమ్మ పచ్చీసుగళ్లు గీస్తోంది. అత్తగారు చిన్నగవ్వలూ తనవని యేరుకుంటున్నారు. నేను గువ్వలు తీసుకుంటున్నాను. అంతట్లో వాళ్ల సూరమ్మ వచ్చి "మాయింటో సంగీతం పాడుతున్నారు, రా" అంటూ అమాంతంగా చెయ్యి పట్టుకొని లాక్కుపోయింది.

వెంకటశాస్త్రి — ఆపళంగా వెళ్లావు. కదూ?

బంగారమ్మ — వెళ్లక తప్పిందికాదు. పోనీ, వెళ్లకుండా వుండలేకపోయా ననుకో.

కాంతమ్మ—అమ్మాయికి సంగీతం అంటే సరదా గదా అని నేను వెళ్లమన్నానుకూడాను.

బంగారమ్మ — అవును. అన్నట్లు మరిచిపోయాను. అమ్మకూడా వెళ్లమంది నాన్నోయి!

వెంకటశాస్త్రి — మీఅమ్మ వెళ్లమందూ మరీ?

కాంతమ్మ — ఎంచేతో?

వెంకటశాస్త్రి — ఆశమ్మా, బోశమ్మా అంటూ లోకంలో వుండీ మొగుహూ పెళ్లాలనందర్నీ పేరు వరసలని యెక్కిరిపిస్తూ కూచోడానికి.

కాంతమ్మ — అమ్మాయి వుంటే ఆపని కేమి అడ్డండీ?

వెంకటశాస్త్రి — కొన్ని తెలిసీ, కొన్ని తెలవకా యేవో అడ్డదిడ్డంగా ప్రశ్నలువేసి—

కాంతమ్మ — వులకం. అలాంటి భయం మీకుందేమో గాని మాకు లేదు సుమండీ!

వెంకటశాస్త్రి — ఉంటే లోకంలోవాళ్లనందర్నీ అలా యెందు కాడిపోసుకుంటారూ?

బంగారమ్మ — అబ్బా! నన్ను చెప్పనిస్తు నాన్నా!

వెంకటశాస్త్రి — సరే వెళ్లావు. ఎవరో పాడారు. నువ్వు విన్నావు. కొంతసేపు ఆపాటతోకూడా నీ మనస్సు నృత్యం చేసింది. ఇంటికి వచ్చి కూనిరాగాలు తీస్తూ కొంతసేపు నువ్వు సొంతంగా పాడుకున్నావు. అవునా అమ్మా?

బంగారమ్మ — ఇంకా వుంది నాన్నా!

వెంకటశాస్త్రి — ఉంటే అదేమిటో చెప్పూ.

కాంతమ్మ — ఊకొడుతూ వూరుకోరాదూ, అంతా చెప్పేదాకానూ?

వెంకటశాస్త్రి — నువ్వెందు కూరుకున్నావు కాదూ?

కాంతమ్మ — మీరు బిడ్డ వుత్సాహాన్ని చెడ కొడుతూ వుంటే—

బంగారమ్మ — అబ్బా, ఉండు నాన్నా! నువ్వు మాట్లాడకే అమ్మా! నే నంతా చెప్పేదాకా నువ్వుకూడా మాట్లాడకు నాన్నా!

వెంకటశాస్త్రి — అలా అయితే మరికానియ్యి.

బంగారమ్మ — హాలంతా కిటకిటలాడుతూ కూచున్నారు మొగాళ్లు. ఆడాళ్లు వసారాలో కూచున్నారు. పిల్లలంతా ఆడాళ్లలోనూ, మొగాళ్లలోనూ యెక్కడ వీలుంటే అక్కడ కూచున్నారు. నేనూ, వాళ్ల సూరమ్మా ముందే కూచున్నాం నాన్నోయి.

వెంకటశాస్త్రి — (వినీ, చూసీ వూరుకొంటాడు.)

బంగారమ్మ — ఊరుకుంటావేం నాన్నా?

వెంకటశాస్త్రి — నువ్వు మాట్లాడవద్దన్నావు కాదూ మరీ?

బంగారమ్మ — సరే. అదా యేమిటి?

కాంతమ్మ — మీగుణం పోనిచ్చుకున్నారు కారు.

వెంకటశాస్త్రి — ఊరుకోమన్నప్పుడు మాట్లాడితే అప్పుడేమంటావో నువ్వు?

బంగారమ్మ — ఊ కొట్టవద్దన్నానా?

వెంకటశాస్త్రి — మాట్లాడవద్దన్నావు; గాని వూకొట్టమన్నావా మరీ?

బంగారమ్మ — అన్నీ చెప్పడం యెలాగ నాన్నా? ఊహించుకోవద్దూ?

కాంతమ్మ — మీ నాన్న యెప్పుడూ ఇంతేనే అమ్మాయీ!

బంగారమ్మ -— నువ్వుండవే అమ్మా! ఏం నాన్నా? "ఊ" అనూ.

వెంకటశాస్త్రి — ఊ.

బంగారమ్మ—పాడీవా రెవరో అనుకున్నాను. మన పేరుభట్లు బావే నాన్నోయి!

వెంకటశాస్త్రి — ఊ.

బంగారమ్మ — ఇప్పుడు "ఊ" అంటే చాలదు నాన్నా! మధ్యమధ్య మాట్లాడుతూవుండాలి. పిడుక్కీ బియ్యానికీ ఒకటేమంత్రమా యేమిటి?

వెంకటశాస్త్రి — మాట్లాడితే "అదిగో మాట్లాడతా" వంటావు. లేకపోతే లే దంటావు. నీవుద్దేశం ప్రకారం యెప్పు డేంచెయ్యాలో నా కెలా తెలుస్తుందమ్మా?

బంగారమ్మ — వుద్దూరాలు చెబుతా వేమిటి నాన్నా? కథ మామూలుగా వెళ్లి పోతూవుంటే "ఊ" అంటే చాలు. ఏదేనా విశేషం వచ్చినప్పుడు తోచిన మాట అనాలి. అసలు తోచకుండా వుండనే వుండదూ.

కాంతమ్మ — నిజంగా మీ నాన్న కిప్పు డేమీ తోచనే లేదనుకున్నావుటే బంగారం?

వెంకటశాస్త్రి -— అమ్మాయిని నువ్వు చెప్పనియ్యవా యేమిటి?

కాంతమ్మ — మీరు దాని సరదా తీరనివ్వరా యేమిటి?

బంగారమ్మ — మధ్యమధ్య మీతగువేమిట్రా రామాయణంలో పిడకల వేట్లాట లాగా?

వెంకటశాస్త్రి—మా బాగా అడిగావమ్మా!

కాంతమ్మ — ఆమాట యెవరికి తగులుతుందో?

బంగారమ్మ — ఎవరికో వొకరికి. ఆపళంగా వూరుకోండి, కజ్జా పెంచుకోక. అమ్మా, నాన్న యేమన్నాను వ్వూరుకో. నాన్నా, నువ్వు కొంటెతనం లేకుండా విను.

కాంతమ్మ—మీ నాన్న గిల్లి కజ్జా పెడతారు.

వెంకటశాస్త్రి — చూశావా తల్లీ?

బంగారమ్మ — ఉ: మీరు చెప్పడం నాదే తప్పు. నేను లేచిపోతాను బాబూ. (లేవబోతుంది).

వెంకటశాస్త్రి — (ఆమెని గట్టిగా పొదివి పట్టుకుని) ఇక సరిగ్గా వింటానులే. ఈమాటు చెప్పు.

బంగారమ్మ — ఎందు కేమిటి పూరికేసు?

వెంకటశాస్త్రి — మా అమ్మవు కాదూ? ఇక బాగా —

బంగారమ్మ — ఒక్క క్షణం బాగావింటావు. తరవాత మళ్లీ మొదలూ.

వెంకటశాస్త్రి — ఇక అలా చెయ్యనులే.

కాంతమ్మ — అంత నిలకడ వుంటేనా?

వెంకటశాస్త్రి—మీయమ్మని నేనిప్పు డేమేనా అన్నానా ఏంతల్లీ?

కాంతమ్మ — నే నేంతప్పుమాట అన్నానూ? ఊరుకోండి అమ్మాయికి విసువెత్తించిక.

వెంకటశాస్త్రి — చెప్పవే తల్లీ!

బంగారమ్మ — ఆపళంగా బావ వచ్చి ముందు కూచున్నాడు.

వెంకటశాస్త్రి — ఇప్పు డేమేనా అనాలా రేమిటమ్మా?

కాంతమ్మ — మొదలూ —

బంగారమ్మ — అయితే లేదే అమ్మా! ఒక్క క్షణం కూచుని, తరవాత కంఠం సవరించుకొని బావ పాట మొదలుపెట్టాడు. ఒక అర గంటదాకా గొంతుకు వొకమోస్తరుగా వుంది. తరవాత కమ్మెచ్చువ తీసి నట్లుంది నాన్నా!

వెంకటశాస్త్రి — అంత బాగుందిటమ్మా?

బంగారమ్మ — కోయిల కూసినట్టుంది. కంఠం సాఫయినకొద్దీ బావకి సంతోషం యెక్కువయింది. సంతోషం యెక్కువయిన కొద్దీ తల చమత్కారంగా వూపుకుంటూ, యించక్క కళ్లు తేలవేసుకుంటూ, మధ్యమధ్య తొడమీద తాళం వేసుకుంటూ — ఎంత అందంగా పాడా డనుకున్నావు బావా!

వెంకటశాస్త్రి — ఎప్పుడూ వినలేదుసుమా నేనూ.

బంగారమ్మ — ఆపాట హాలంతా పాకి పోయింది నాన్నా!

కాంతమ్మ — అంత బాగుందిటే?

బంగారమ్మ — గోదావరి కెరటాలమీద మన రేవులో వున్న చిన్న స్టీమరెలా ఆడిపోతుందో, పెద్ద గాలివేస్తే గులాబీచెట్టుమీద పువ్వు ఎలా వూగి పోతుందో ఆపాటతో నామనస్సు అలా ఆడిపోయింది.

వెంకటశాస్త్రి — ఆ?

బంగారమ్మ — ఆపళంగా వెళ్లి బావ వొళ్లో కూచుందా మన్నంత సరదా అయింది నాకు.

వెంకటశాస్త్రి — అం తేగదా?

కాంతమ్మ — లేకపోతే యే మనుకున్నారు? మొగపిల్లల్లాగ ఆడపిల్లలు తొందరపడరు.

వెంకటశాస్త్రి — మీయమ్మతో మాట్లాడవద్ద న్నావు, కదూ తల్లీ?

కాంతమ్మ — అక్కరేలేదూ.

బంగారమ్మ—మళ్లీ మీరు కజ్జా పెంచుకుంటా రేమిట్రా? ఏం నాన్నా! బావచేత నాకు ఫిడేలు నేర్పించవూ? వెధవహార్మనీ నాకు వద్దు బాబూ!

కాంతమ్మ — అంత అదృష్టమా అమ్మా నీకూ?

బంగారమ్మ — ఏమే? ఏం నాన్నా?

వెంకటశాస్త్రి — బావ మనయింటికి రాడమ్మా.

బంగారమ్మ — అయితే నేను బావబసకే వెడ తాను.

కాంతమ్మ — మనతో మాట్లాడ్డమ్మా.

బంగారమ్మ — ఏం?

కాంతమ్మ — వాళ్లవాళ్లు ఏమేనా అంటారనీ.

బంగారమ్మ — చూడవచ్చారా రేమిటి ఇక్కడికి?

వెంకటశాస్త్రి — నీ వుబలాటమేగాని అక్కడికి వెళ్లినా బావ నీతో మాట్లాడ్డమ్మా.

బంగారమ్మ — నేను పలకరిస్తే మాట్లాడ కుండా వుండగలడా?

వెంకటశాస్త్రి — అంతధైర్యమే నీకు?

బంగారమ్మ — ఓ! చూసుకో యీమాటు.

కాంతమ్మ — సాహసించకమ్మా! అతను మాట్లాడకపోతే మనస్సు చివుక్కు మంటుంది నీకు.

బంగారమ్మ — చూస్తాను గామా!

వెంకటశాస్త్రి — (ముందుకు చూసి) ఆ వచ్చేవారు—పేరుభట్టేనా?

బంగారమ్మ — ఆ! రానీ. (చిటికెలువేస్తూ) నిమిషంలో రప్పించేస్తాను చూసుకోండి బావని.

కాంతమ్మ—వద్దు సుమా.

వెంకటశాస్త్రి — నామాట వినుసుమా.

(పేరుభట్టు బసకు పోతూ ఆదారినే వస్తాడు. చేతిలో గుప్పెడు తమలపాకు లుంటాయి).

పేరుభట్టు — ముగ్గురూ వీధిలోనే కూచున్నారు. ఏంచెయ్యను? మాట్లాడ్డమా? మానడమా?

బంగారమ్మ — (తల్లినీ, తండ్రినీ చూసి, కనుసన్న చేసి కంఠం నొక్కుకొని) బావోయి!

పేరుభట్టు — (స్వగతము) అనుకున్నంతా అయింది. అస లిందాకా సభలోనే పలకరిస్తుం దనుకున్నాను. సమయానికి అత్తా, మామాగూడా దగ్గిరే వున్నారుకూడానూ.

బంగారమ్మ — ఏమి తక్కుతావు, రావోయి బావా.

పేరుభట్టు — (స్వగతము) ఏమయితే క నీ. (గుమ్మంలోకి వెడతాడు.)

వెంకటశాస్త్రి – ఇంకెందుకూ? వచ్చికూచో రా.

కాంతమ్మ — బావకి కాళ్లు కడుక్కోడానికి నీళ్లియ్యి తల్లీ!

బంగారమ్మ — అవునవును. మరిచిపోయాను. (ఇంట్లోకి వెళ్తుంది.)

కాంతమ్మ — మీవాళ్లకి మేము పగవాళ్లమైపోయాము. నువ్విక్కడికి వచ్చినట్లు తెలిస్తే యేమంటుందో మీయమ్మ.

వెంకటశాస్త్రి — దాని మొఖం. ఏముంది అనడానికీ? అయినా వీ డలాంటి బెదిరింపులికి జడిసేవాడు కాడు. ఏమిరా పేరుభట్టూ?

పేరుభట్టు — జడవడాని కేంవుంది మామా? సంసారంలో వున్నతరవాత యేవో తవ్వాయిలు వస్తూనూ వుంటాయి, పోతూనూ వుంటాయి.

కాంతమ్మ — ఇంతకీ: మీయమ్మకి మే మేమీ లోటు చెయ్యలేదు. ఏటా విజయదశమికి, సంకురాత్రికీ, సంవత్సరాదికీ తీసుకువచ్చి, యేదో, మాతాహతుకి లోపం లేకుండా పచ్చంచుల బట్టలు పెడుతూనే వచ్చాము. మీచిన్నయ్య పెళ్లికి మూడువందలు అప్పివ్వలేదని ఆవిడికి మామీద కోపం. అక్కడ గడవక యిక్కడికి వచ్చి యేదో ముక్తసరుగా కాలం గడుపుకొంటున్నాం; గాని మాదగ్గిర యేంవుందోయి?

పేరుభట్టు — ఉన్నంత వుంది, లేనంత లేదు. ఉన్నా యివ్వడాని కిష్టం వుండాలి. పైగా వీలుకూడా వుండాలి. ఇవ్వకపోడాని కనేక కారణా లుండవచ్చు. దానికోసం యింత రగడ పెంచుకోవలసిన పనేమీ లేదు. అయినా, అదంతా యిప్పు డెందుకూ? ఈ తగువులతో నాకేమీ సమ్మంధం లేదు. నామీద యెవళ్లకి ప్రేమ ఉంటే వాళ్లు నాకు దేవుళ్లు. తక్కిన గొడవలు నా కక్కర్లేదు. కాకపోయినా, ఏవో నాలుగు ముక్కలు వస్తే చాలు, నాకంతకంటే వేరే ధ్యానం లేదు.

వెంకటశాస్త్రి — అవునురా. నీ సంగతి నాకు తెలుసు. మొదణ్ణుంచీ నువ్వనవసర ప్రసంగా లంటే దూరంగానే ఉంటావు. ఈ తగువుల కన్నింటికీ మూలం మీ చిన్నన్నయ్య. ఎక్కడచూసినా ప్రతీ వాళ్ళ కొడుకుల్లోనూ రెండోవాళ్లింతే. పెద్దా డప్పటి కప్పుడే యేదో సంసారంలో పడతాడు, ఇక రెండోవాడు — తనకి చేతగాదూ, ఊరుకో లేడూ. నింపాదిగా తల్లిదగ్గిర తాసికలు మొదలుపెడతాడు. క్రమక్రమంగా తండ్రిని కూడా లోపు చేసుకుంటాడు. ఇక చెప్పే దేమిటి? ఆడిస్తా డాట.

(అప్పుడు బంగారమ్మ నీళ్లు తెచ్చి అక్కడ పెడుతుంది. పేరుభట్టు చెంబు తాకి ఊరుకుంటాడు.)

బంగారమ్మ — కాళ్లు కడుక్కో బావా!

పేరుభట్టు — కడుక్కున్నట్టే లే. కూచో నువ్వు.

బంగారమ్మ — ఎక్కడ కూచోమంటావు బావా?

పేరుభట్టు — నీయిష్టం వచ్చిన చోట. నీమనసయినచోట. నీ కడ్డేమిటి?

బంగారమ్మ — అయితే నామనసు వచ్చిన చోటిదీ. (అతని వొడిలో కూచుంటుంది.)

పేరుభట్టు — (ఆమెని పొదివి పట్టుకుని) దయ వుందన్నమాటే.

కాంతమ్మ — తప్పుకాదుతల్లీ? చనువిస్తే నెత్తెక్కడమా?

వెంకటశాస్త్రి — పెంకిపిల్ల వనుకోడుటమ్మా బావ?

పేరుభట్టు — తప్పేమిటి మామా? నాకు నచ్చిన పని చేశావు బంగారం నువ్వు.

బంగారమ్మ — మరే, మా నాన్నా, మా అమ్మా మరీనీ.

కాంతమ్మ—పేరుభట్టుకి భేషజాలు లేవుసుమండీ.

వెంకటశాస్త్రి — వాడి మనస్సు నవనీతం లాంటిది. మంచియోగ్యత సంపాదించాడు. సంగీతంలో యీచుట్టుపట్ల యింతటివాడు లేడుట.

బంగారమ్మ — నాకు సంగీతం చెప్పవూ బావా?

పేరుభట్టు — ఓ! ఇంతకంటేనా?

బంగారమ్మ — నాకు ఫిడేలు నేర్పాలి బాబూ! బొయ్యిమంటూ — హార్మనీ యేమందమేమిటి?

పేరుభట్టు — మంచిమాట అన్నావు. నీకు తప్పకుండా ఫిడేలే నేర్పుతాను.

కాంతమ్మ — ఇందాకా నీపాట విందిట. తన మనస్సు నీపాటతో సర్గిగ్గా ఆడిపోయిందిట. సున్నితంగా తల ఆడించుకుంటూ, కళ్లు తేలవేసుకుంటూ పాడేవుట నువ్వు.

పేరుభట్టు — (ఆనందంతో బంగారమ్మ ముంగురులు సవరిస్తాడు.)

బంగారమ్మ — సిగ్గులేదూ బావా నీకూ?

వెంకటశాస్త్రి — ఆపళంగా నీవొళ్లోకి వచ్చి కూచోవా లనుకుందిట, మాచిట్టితల్లి. ఏమమ్మా కదూ?

బంగారమ్మ — (పేరుభట్టుబుగ్గ గిల్లుతుంది.)

పేరుభట్టు — కూచున్నావు కాదేమేమరీ?

బంగారమ్మ — నువ్వు పిలిచావు కాదేం?

పేరుభట్టు — సెబాస్!

కాంతమ్మ — వెఱ్ఱిపిల్ల, ఉబలాటంతప్ప యేమీ యెరగదు.

పేరుభట్టు — నోట్లో వేలుపెట్టినా కొరకలేనిదీ పాపం నీ కూతురు!

బంగారమ్మ — ఏదీ బావా చూస్తాను. (కొరకబోయినట్లు పేరుభట్టుచెయ్యి నోటితో అందుకోబోతుంది).

పేరుభట్టు — ఓహోయి! అసాధ్యురాలవే నువ్వు? (చెయ్యి వెనక్కి తీసేసుకుంటాడు.)

వెంకటశాస్త్రి — అది మోటుతనం అనిపించుకోదూ తల్లీ?

కాంతమ్మ — తప్పు కాదుటే?

పేరుభట్టు — కరవ్వేమరీ. (చెయ్యియిస్తాడు.)

బంగారమ్మ — ఇప్పటికి ధైర్యం వచ్చింది బావకి. అయితేలే. కరిపించుకున్నంత పనిచేశావు. అంతే చాలులే.

కాంతమ్మ — భోజనం యెక్కడ అల్లుడా?

పేరుభట్టు — వారాలు చేసుకుంటున్నానత్తా.

వెంకటశాస్త్రి — పోనీ, మాయింటో భోజనం చెయ్యరాదుట్రా?

బంగారమ్మ — అవును. ఏంబావా! మాయింటో భోంచేస్తావుండు. ఏమే అమ్మా?

పేరుభట్టు — మహాపెట్టేదానిలాగే అడుగుతున్నావూ?

బంగారమ్మ — ఏమమ్మా? నాకు వంట చేతగాదనుకున్నావా యేమిటి? బంగాళాదుంపలకూర నేను వండినట్లు మా అమ్మకూడా వండలేదు. మల్లెపువ్వల్లా వుంటుంది నేను వండితేను, అన్నం.

కాంతమ్మ — ఊరికే అలా వూరిస్తాడు; కాని మనయింటికి వస్తాడుటే అతను?

పేరుభట్టు — మీయమ్మ యేమంటోందో విన్నావా బంగారం?

కాంతమ్మ — రాకూడ దనుకొనేవాళ్ళకి అన్నీ వంకలే.

బంగారమ్మ—నువ్వీవాళ మాయింటోనే భోం చెయ్యాలి. ఎక్కడికీ వెళ్ళడానికి వల్లకాదు. లేవ్వే అమ్మా! ఆ రవుతోంది. పెందరాళే వంటచెయ్యి.

పేరుభట్టు — నువ్వు చేస్తా నన్నావు కాదుటే వంటా?

బంగారమ్మ — అవునవును. నేనే వండుతాను. నువ్వు నిప్పుచెయ్యవే అమ్మా! మాఅమ్మ నిప్పుచేసి, కూరతరిగి, బియ్యంకడిగిలోపున నేను తమలపాకులికి సున్నంరాసి, చిలకలు చుట్టి అట్టేపెడతాను. ఏం బావా?

పేరుభట్టు — నీ కన్నీ తెలుసును. మహామంచి దానవు నువ్వు. (గుచ్చి కవుగిలించుకొంటాడు.)

కాంతమ్మ — అల్లుడికి వింటూ. బజారుకి వెళ్లి రండి మీరూ.

వెంకటశాస్త్రి — ఏం తెమ్మంటావమ్మా?

బంగారమ్మ—బంగాళా దుంపలు వీసెడూ—

వెంకటశాస్త్రి — అన్ని కావాలిటే బావకి?

బంగారమ్మ — తెస్తూ, మిగిలితే వుండవూ?

పేరుభట్టు — అదీయెత్తు, రవ్వారట్టూ గంగా నమ్మదీ, అట్టూ, పిట్టూ ఆసాదాడిదీనీ.

బంగారమ్మ — సంగీతం పాడేవాళ్ళకి యెంతయినా చాలదూ. ఏం? సరిపోయిందా?... ఇలా విను నాన్నా! పాతిక బంగినపిల్లిపళ్లూ, మునకాడలూ, వంకాయలూ, పనసపెచ్చూ, పచ్చిమిరపకాయలూ, కొత్తిమిరీ, గుమ్మడిబద్దా, అరిటాకులూ—

పేరుభట్టు — పులుసులోకే?

బంగారమ్మ — నేను వంటచేశానంటే ఆవంటకాలతోపాటు విస్తరాకుకూడా తినేస్తావు నువ్వు.

పేరుభట్టు — విస్తరాకు తింటేగాని కడుపు నిండినంత చక్కగా వండుతా నన్నమాట నువ్వు.

బంగారమ్మ — వేళాకోళం చేస్తున్నావు. నాకు తెలుసునోయి, బావా, నీచమత్కారాలు.

వెంకటశాస్త్రి — లేవరా యింటోకి వెడదామూ.

పేరుభట్టు — బసకివెళ్లి, డ్రెస్సు తీసేసి, గోదావరిలో స్నానంచేసి, పట్టుపంచె తెచ్చుకుంటాను మామా!

కాంతమ్మ — మీమామ తాపితా యిస్తారు లేవోయి!

బంగారమ్మ — అవునుబావా! నేను వేన్నీళ్లు పెడతాను కూడానూ.

పేరుభట్టు —వేసవిలో వేన్నీళ్లూ, శీతాకాలంలో చన్నీళ్లూ యిస్తావుకామోసు నువ్వు.

బంగారమ్మ — అయితే కావలసినన్ని నీళ్లు తోడేస్తాను, నూతికిరా.

పేరుభట్టు — నువ్వు నీళ్లేతోడతావా, వంటే చేస్తావా?

వెంకటశాస్త్రి — అయితే గోదావరికే వెళ్లి రారా. ఇదిగో అంగాస్త్రం. (ఇస్తాడు)

పేరుభట్టు — (పుచ్చుకొని చొక్కాతీస్తాడు.)

బంగారమ్మ — ఇలా తే బావా! (పుచ్చుకొని) నిమిషంలో వంటచేసేస్తాను లేవ్వే అమ్మా!

(అందరూ నిష్క్రమిస్తారు.)

రెండోరంగం

[రాత్రి భోజనానంతరం తాంబూలం వేసుకొంటూ వెంకటశాస్త్రీ, పేరుభట్టూ వీధిఅరుగుమీద నుంచుని వుంటారు.]

పేరుభట్టు — బసకివెడతాను మామా.

వెంకటశాస్త్రి — అప్పుడే వెళ్లాలా?

పేరుభట్టు — కళావంతుల కుర్రాడొకడు పాఠానికి వస్తాడు. నెలకి పదిరూపాయలిస్తాడు. ఒక రోజున పాఠంలేకపోతే యేమీ అనుకోడుగానీ — అయినా యెందుకూ మానెయ్యడం?

వెంకటశాస్త్రి — సరే మరీ. ఎప్పుడేనా వచ్చి కనపడుతూ వుంటావుకానూ?

పేరుభట్టు — తప్పకుండానూ.

వెంకటశాస్త్రి — చూడూ, బంగారం నీదగ్గిర సంగీతం చెప్పుకుంటానంటోందిరా. వీలయితే—

పేరుభట్టు— వీలయితేయేమిటి? వీలుచేసుకోవాలన్నమాట. నువ్వు చెప్పాలా? ఇందాకా బంగారం అడిగినప్పుడే నిశ్చయించుకున్నాను. కాని పదిహేను రోజులు కొంచెం తొందరపనులున్నాయి. అమావాస్య వెళ్లనియ్యి.

వెంకటశాస్త్రి — సరే.

పేరుభట్టు — బంగారం చూస్తే వెళ్లనివ్వదు. దాంతో నేను వెళ్లాననిచెప్పు. అత్తతో చెప్పే వచ్చానులే.

వెంకటశాస్త్రి — పద.

(పేరుభట్టు వెళ్లిపోతాడు.)

వెంకటశాస్త్రి — (స్వగతం) కాలగతి యెంత చమత్కారంగా వుంటుందీ! ఎప్పుడేం జరుగుతుందో యెవరికీ తెలవదుకదా? నాలుగేళ్లయింది, వీడుమాట్లాడీ నాతోటి. నాటికి మళ్లీ నేడూ. ఎంతవింతా? మాట్లాడ్డమే కాకుండా భోజనం చెయ్యడంకూడానూ ...... వీడిగుణం యెప్పుడూ మంచిదే. ఇదంతా నూరన్న చేస్తున్నాడు. వాడంత విషప్పుచ్చాలు లోకంలో మరి లేరు. కానయితే వీడు మాట్లాడ్డం మంచిదే. ఏం శాశ్వతమూ? ఇంతకీ: యెట్లొచ్చి యెటుపోయినా, నాలుగురాళ్లు సంపాదించుకొనేవాడూ, పేరు తెచ్చుకొనేవాడూ, సుఖపడేవాడూ వాళ్లలో కల్లా వీడొక్కడే.

(తెరలో.)

శాస్త్రులుగారూ!

వెంకటశాస్త్రి — ప్రకాశం బావగారా? దయచెయ్యాలి.

(తెరలో)

భోజనా లయినాయా?

వెంకటశాస్త్రి — ఇప్పుడే చేతులుకడుక్కున్నాం. వచ్చారుకారు.

(ప్రకాశం వస్తాడు)

ప్రకాశం — మాయింటోనూ యిప్పుడే భోజనాలయినాయి ... ఎవరో చుట్టాలు వచ్చారని తెలిసిందీ?

వెంకటశాస్త్రి — మా మేనల్లుడండీ. మాచిన్నక్క కొడుకు. నాలుగు నెల్లనుంచి యీవూళ్లోనే వుంటున్నాడు వాడు.

ప్రకాశం — ఎందుకూ?

వెంకటశాస్త్రి— మేఘసందేశం చదువుతున్నాడిక్కడ. విజయనగరంలో యేడెనిమిదేళ్లుంచి సంగీతంలో చాలా పనిచేశాడు. సంగీతానికి సాయం సాహిత్యంకూడావుంటే బాగుంటుందని కావ్యాలు ప్రారంభించాడు. రఘువంశం విజయనగరంలోనే అయిపోయింది. కుమారసంభవం తునిలో పూర్తిచేశాడు. ఈవూళ్లో స్థిరంగా మకాంపెట్టదలచి, చదువుపూర్తి అయేలోపున కొందరు గృహస్థుల్ని పరిచయం చేసుకోవచ్చుగదా అనీ, గొప్పసాహిత్యగాళ్లకి మొనగాడని పేరుపడిన రామదీక్షితులుగారి వుపదేశం పొందాలనే వుబలాటంతోటీ యీవూళ్లో ప్రవేశించాడుట.

ప్రకాశం — గాత్రపాటా, లేక—

వెంకటశాస్త్రి — గాత్రపాట అభిమానవిష యం. ఫిడేలు వాయించడంలో మంచినాజూకుతనం అబ్బిందిట. ఇందాకా మల్లాదివారి యింటో పాడేడుట. మీరువెళ్లి వినలేదూ ?

ప్రకాశం — ఆయనేనా ? మంచి పాట గాడండీ. చాలారోజులయింది ఆమాత్ర ప్పాటవినీ. ఒక వెలుగు వెలిగించగల పద్దే.

వెంకటశాస్త్రి — కానైతే, వాడిపాట నేనె ప్పుడూ వినలేదు; కానీ అలాగే చెప్పారు, విన్నవాళ్లు చాలామంది.

ప్రకాశం — నాలుగు నెల్లనుంచి యిక్కడే వుంటున్నారంటిరి. పైగా మేనల్లుడుకూడానూ. అలా చెబుతున్నారేం ?

వెంకటశాస్త్రి—మాకూ వాళ్లకీ నాలుగేళ్లనుంచి రాకపోకలూ, ఉత్తర ప్రత్యుత్తరాలూ — చివరికి ముఖావలోకనాలూకూడా లేవు. ఇవాళే కలిసింది వాడికీ మాకూనూ. మల్లాదివారి యింటిదగ్గిరనుంచే కాబోలు, యీదారినే వెడుతున్నాడిందాకాను. వాడి పాట మాటే చెబుతోంది అప్పుడు బంగారం. వాణ్ణి చూసి, సాహసించి పిలిచింది. ఒక్కక్షణం నుంచుని అనుమానించాడు; గాని మళ్లీ పిలిచాటప్పటికి గుమ్మం లోకి వచ్చాడు. ఏమి శాశ్వతం అని నేను పలకరించాను. కత్తు కలిసిపోయింది.

ప్రకాశం — మంచిపని చేశారు.

వెంకటశాస్త్రి — వాళ్లల్లోకల్లా చాలా మంచి వాడండీ వీడూ.

ప్రకాశం— అసలు పట్టింపు లెందుకువచ్చాయీ వారికీ మీకూనూ ?

వెంకటశాస్త్రి—వాళ్లమ్మకి—అంటే మాచిన్న పుట్టిల్లు గోకెయ్యాలని దురాశ. రెండోకొడుకు మాఅక్క ఆశకి పదునుపట్టాడు. వాడి పెళ్లి వచ్చింది. మాబావసంపాదనవల్ల సంసారం దిగదీసిందిగాని చిగిరించలేదు. అప్పు చెయ్యవలసివచ్చింది. బదులని మాఅక్క నన్ను మూడువందలరూపాయ లడిగింది. నాసంగతి మీకు తెలిసిందేగా ? పాలకొల్లులో కొన్నతోటకి నాకప్పటి కింకా మూడువందల అప్పేవుంది. కాకపోయినా మా అక్కకి మూడువందలూయిస్తే వాట్లకోసం నీళ్లువదులు కోవలసిందే. పోతే పోయాయని యెలాగేనా యివ్వ డానికి నాయింటో ధనం మూలగడం లేదు.

ప్రకాశం — మూలుగుతున్నా, అప్పనియిచ్చాక వొదులుకోడం కష్టమే. ఇంతకీ: సాయం చెయ్యమని అడక్క ఆలౌక్యం యేమిటీ?

వెంకటశాస్త్రి — చివరికి లౌక్యంచెయ్య డానికే.

ప్రకాశం — బాగాచెప్పారు. అయితే మీ రివ్వనన్నారు.

వెంకటశాస్త్రి — నాదగ్గిర దాపరికాలు లేవు. మీకే యెరుగుదు రాసంగతి. అప్పుడు నాదగ్గిర రూపా యలూ లేవూ. ఉన్నా యివ్వడమూ యిష్టంలేదూ. ఆమాటే చెప్పేశాను.

ప్రకాశం — పచ్చిగడ్డిలో అగ్నిహోత్రం పడిం దన్నమాట.

వెంకటశాస్త్రి — అక్షరాలానూ. అయితే, నేను వేశానా, వాళ్లువేశారా ? ఇది తీరని ధర్మ సూక్ష్మం. నిప్పు పడితే వూరుకుంటుందీ ? రవిలింది; భగ్గుమంది. అదిమొదలు వాళ్లు సరిగ్గా మాట్లాడ్డం మానే శారు. తరవాత మాబావ పోయినప్పుడు వెడితే మా అక్క దుర్భాష లాడింది. అయినా లోకానికి జడిసి, పదిరోజు లట్టే పెట్టుకుని వొకబట్ట పెడదామని మాయింటికి రమ్మని యెంతచెప్పినా గిజాఅంది; గాని వచ్చిందికాదు.

ప్రకాశం — అంతదాకా వెళ్లిందీ ?

వెంకటశాస్త్రి — అదలా ముదురుతూనే వుం డగా యిప్పుడు వీడు రాకపోకలు మొదలుపెట్టాడు. దీనివల్ల వీడికిచిక్కులు — అంటే కుటుంబకలహాలు

రావచ్చు ... యింకోటికూడా వుంది. వీణ్ణి విడతీశానని మా అక్కా, రెండోవాడూ ఇక గోలచేస్తారు.

ప్రకాశం — కాని మీరు చేసినపనిలో తప్పేమీ లేదు. అయితే: యితగాడికి పెళ్లి —

వెంకటశాస్త్రి — ఇంకా లేదండీ.

ప్రకాశం — అయితే యిక యితణ్ణి విడిచి పెట్టవద్దు.

వెంకటశాస్త్రి — అలా అన్నారా ?

ప్రకాశం — తప్పకుండానూ.

వెంకటశాస్త్రి — మీ రన్నమాట ఆలోచించ తగ్గదే.

(అప్పుడు 'బావోయి' అనిపిలుస్తూ బంగారమ్మ వస్తుంది.)

బంగారమ్మ — బావేడి నాన్నా ?

వెంకటశాస్త్రి — బసకి వెళ్లిపోయాడు తల్లీ ! నీతో చెప్పమన్నాడు కూడానూ.

బంగారమ్మ — చూశావా ? నాతో చెప్ప కుండా వెళ్లిపోవడమూ, పైగా నిన్ను చెప్ప మనడ మూనా ? నాకక్కర్లే దీరూపాయలు. ఈమాటు కన బడితే బావ కిచ్చెయ్యి నాన్నా ! (ఇవ్వబోతుంది.)

వెంకటశాస్త్రి — తప్పుకాదుటమ్మా !

బంగారమ్మ — నాతో చెప్పకుండా వెళ్ల డమేం మరీ ? ఈరాత్రి యిక్కడ పడుకోకపోతే పోయింది. నేను వచ్చేదాకానేనా వుండగూడదూ ?

ప్రకాశం — మొగాళ్లకి అనేక పను లుంటాయి. నువ్వు వచ్చేదాకా కూచోమంటే యేలాగా బంగారం ?

బంగారమ్మ — అది కాదండీమామయ్యగారూ ! నేను భోంచేసి వచ్చేలోగా వేసుకుంటూ వుంటాడని తమలపాకుల చిలకలు సొంతంగా చుట్టియిచ్చాను. అసలు నేను వచ్చి యివ్వవలిసింది.

ప్రకాశం — మీబావ నువ్విచ్చిన తాంబూలం పుచ్చుకుని వేసుకున్నాడు. గనక అతనిచ్చిన రూపా యలు నువ్వు పుచ్చుకోవాలి. వద్దనగూడదు.

బంగారమ్మ — పుచ్చుకున్నాను కాదూ మరీ, మాబావ చిన్నపుచ్చుకుంటాడనీ. నేను వచ్చేదాకా వుండకపోడమేం ?

వెంకటశాస్త్రి — మళ్లీవస్తాడు కాదూ ?అప్పుడు గట్టిగా అడుగుదువుగానిలే.

ప్రకాశం — నీరూపాయలు నాకు బదులిస్తావా కోడలా ?

బంగారమ్మ — పుచ్చుకోండి మామయ్యగారూ ! (ఇవ్వబోతుంది.)

ప్రకాశం — వడ్డీ యెలాగా ?

బంగారమ్మ — మీకు గనక రూపాయికి అణా.

ప్రకాశం — సెబాస్ ! చాలాచాలాదయ వుం దన్నమాటే.

వెంకటశాస్త్రి — మల్లాదివారు పాడించి యాభై రూపాయ లిచ్చారుట. పరికిణీ, చొక్కా కుట్టించుకో మని అందులోవి పదిరూపాయ లిచ్చాడు, వద్దంటూం టేనూ బంగారానికి.

ప్రకాశం — వద్దనడం యేమీ ? అందచందాలు తెలిసినవాడులా వున్నాడు.

వెంకటశాస్త్రి — మంచి ఆరిందామనిషండీ. ఏమాత్రమో నిలవకూడా చేశాట్ట పెళ్లికోసం.

ప్రకాశం — అదీ తెలివంటే.

వెంకటశాస్త్రి — మొదణ్ణుంచీ వాడి పద్ధతే వేరండీ. పెద్దాడు అత్తారిచ్చిన బట్టలేగాని కట్టడు. రెండోవాడు యింటో తడుము ల్లాడతాడు. వీడు స్వయంగా కొనుక్కుంటాడు. పట్టంచుల చాపులేగాని కట్టడు. శుచీ, శుభ్రమూ యెక్కువ. దర్జాగా వుం టాడు.

ప్రకాశం — సంపాదించేవాడికి లోటేమిటీ ?

వెంకటశాస్త్రి — చదువుకో తల్లీ నువ్వువెళ్లి లేకపోతే మీయమ్మకి కొంచెం సాయం చెయ్యరాదూ ?

బంగారమ్మ — మా బావ బస యెరుగునురా మామయ్యగారూ ?

ప్రకాశం — వెడతావా యేమిటి ?

బంగారమ్మ — దగ్గిరయితే.

వెంకటశాస్త్రి — రేపు తీసుకువస్తాను లేవమ్మా!

బంగారమ్మ — ఈరాత్రి నిద్రపట్టడం యెలాగా ? సంగీతం పాడమందా మనుకున్నాను. బావ మంచిపని చేశాడు కాడు. రానియ్యి రేపు, బుగ్గలుచిదిమి చేతిలో పెడతాను. (వెళ్లిపోతుంది.)

ప్రకాశం — మరి సెలవూ, మామరదలు వచ్చింది రాకరాక యివాళ. కూతురికి సమ్మంధం చూడమంటుంది. మా తోడల్లు జ్ఞాకుగునురు కామూ? భోంచేస్తాడు, చీట్లాటలో కూచుంటాడు.

వెంకటశాస్త్రి — మంచిప్రయోజకుడు.

ప్రకాశం — విస్తరాకుగూడా మామరదలే కుట్టాలండీ.

వెంకటశాస్త్రి — పుట్టుభోగి అన్నమాట.

ప్రకాశం — అడగక్కర్లేదు.

వెంకటశాస్త్రి — మరి వెళ్లి అదేదో చూడండి.

ప్రకాశం — సెలవూ.

వెంకటశాస్త్రి — సెలవూ.

(ఇద్దరూ వెళ్లిపోతారు.)

మూడో రంగం

[పేరుభట్టు బస. అరుగుమీద అతను పచారు చేస్తూవుంటాడు]

పేరుభట్టు — (తాదాత్మ్యంతో) రాత్రంతా వొకటేకల. బంగారం వంటి వడ్డించడమూ, నేను భోంచెయ్యడమూనూ. అది తమలపాకులు చుట్టియివ్వడమూ, నేనువేసుకోడమూనూ. అది నావొళ్లో కూచోడమూ, నేను ముంగుర్లు సవరిస్తూ దాన్ని ముద్దుపెట్టుకోడమూనూ. ఎంత మధురమైన స్వప్నమూ! కాని యిలా వచ్చిందేమీ యీ కలా? నాలుగేళ్లయింది బంగారాన్నీ, అత్తనీ, మామనీ చూసీ — అంటే వాళ్లతో మాట్లాడీ. అప్పటికిప్పుడు మళ్లీ సమావేశమూ, సల్లాపమూనూ. అప్పటికి బంగారం యెనిమిదేళ్లపిల్ల. ఇప్పుడు పన్నెండోయేడూ. ఎంత చురుకైనపిల్లా! ఎంత నాజూకైనబాలికా! ఎంత నాగరికతగల మరదలూ!

సెబాస్! అమాంతంగా వచ్చి వొళ్లో కూచుంది బంగాళాదుంపల కూరతో మల్లెపువ్వుల్లాంటి అన్నం పెడుతుందిట. ఆమాటలో అమృతం తొణికిసలాడిపోవడం లేదూ? నాజీవితానికంతా ప్రేమనిండిన యీఆదరం చాలదూ ?

కాళిదాసు శృంగారం వర్ణించడంలో నాజూకైనవాడే; కాని అతని కవిత్వంలో యిలాంటి సన్నివేశం యేదీ ? బంగారం చూడ్డానికి పన్నెండేళ్ల చిన్నపిల్లే. కవిత్వంఅంటే యేమిటో యెరగని ముద్దరాలే. కాని నాలుగు చినచిన్న మాటలతో ప్రణయమాధుర్యాన్ని విరజిమ్మివేసింది. నా ప్రారంభజీవితానికి నూతన సంస్కారం కలిగించింది. నాహృదయ కుహరంలో రసమయజగత్తు నంకితంచేసేసింది.

బళా! బంగారం! ఎంతప్రతిభావంతురాలవూ నువ్వూ ? నీహృదయంలో యెంత మధురోన్నతభావాలు పరిమళిస్తున్నాయీ ? పన్నెండేళ్ల ప్రాయంలో భారత రమణీత్వాన్ని కూలంకషంగా ప్రకటించివేశావే ?

నాబంగారం ! నీపరోక్షంలో — నీతల్లిదండ్రులికి తెలవకుండా నిన్ను నాదాన్నిగా భావించుకోనియ్యి. అంతే. అంతేచాలు యీ దురదృష్టవంతుడికి. నీకూనాకూ మధ్య గభీరపరిఘ వున్నది. దాన్ని దాటడానికి నాకు శక్తిలేదు. సాధనాలు తొలగించి వెయ్యబడ్డాయి. ఆశ లేదు ...... లేకపోవడమేనా ? ఉరకలు వేసుకువచ్చే యీవుత్సాహాన్నీ, మొలతలుతిరిగిపోయే యీమమతనీ తెంచేసుకోవలిసిందేనా ? ...... కాని... ఫలంలేదు. నిజంగా యీజీవితానికి మంచి వినియోగమే లేదేమో ?

గుణగ్రహణశక్తి లేనివాడు నల్లరాయే. అందుకు సందేహం లేదు. అయితే: ఆశక్తివుండిన్నీ అనుభవించ

దానికి పెట్టిపుట్టనివాడికంటే యీవిశాలజగత్తులో అధమాధమవస్తువు యేంవుందీ? వాడికంటే కష్టజీవి— వాడికంటే యీశ్వరవంచితు డింకెవడున్నాడూ?

(అప్పుడు తాటాకుగొడుగువేసుకొని, శాలువ కప్పుకొని, వెంకటశాస్త్రి వస్తాడు.)

వెంకటశాస్త్రి — ఒరే పేరుభట్టూ!

పేరుభట్టు — (ఉలిక్కిపడి) ఏంమామా?

వెంకటశాస్త్రి — (అరుగెక్కి) గట్టిచిక్కు వచ్చిందే!

పేరుభట్టు — ఏమిటి మామా?

వెంకటశాస్త్రి — నిన్నరాత్రి నువ్వు బంగారంతో చెప్పకుండా —

పేరుభట్టు — అది అపరాధమే. కోపం వచ్చిందన్నమాట.

వెంకటశాస్త్రి — నేను తగ్గించలేకపోయానురా ఆ —

పేరుభట్టు — అనుకుంటూనే వున్నాను నేను.

వెంకటశాస్త్రి — నువ్వు దానితో చెప్పకుండా వచ్చినందుకు నువ్విచ్చినరూపాయలు అక్కర్లేదుట.

పేరుభట్టు — అపరాధానికి తగిన ఆగ్రహమే. ఉచితంగానే వుంది.

వెంకటశాస్త్రి — ముందొకమాటు నువ్వు మా యింటికి వెళ్లాలి. ఒకగంటదాకా చూస్తుంది. తరవాత ప్రకాశంగారిని తీసుకొని అదే వచ్చేస్తుం దిక్కడికి.

పేరుభట్టు — అంతయెందుకూ? రెక్కలుకట్టుకొని నేనే అక్కడ వాలి క్షమాపణ చెప్పుకుంటాను.

వెంకటశాస్త్రి.—అది యిలా అందని మరోలాగ అనుకో కుసుమా. ఏమిటో గారంగా పెరిగింది, వొక్కపిల్లకనకా. కోపం వచ్చినా, పట్టుదలవచ్చినా సరసం తప్పదు. నలుగురుపిల్లల్లాంటిది కాదు.

పేరుభట్టు-అదంతా నాకు తెలుసును మామయ్యా. నువ్వుపద. నేను నిమిషాలమీద వెడతానులే.

వెంకటశాస్త్రి — తాలూకా కచేరీకేసి వెళ్లాలి నేను. కానయితే నిన్ను దగ్గిరుండే తీసుకురమ్మని చెప్పిందిగాని బంగారం —- నువ్వు వెంటనే బయలుదేరితే నేను ముందుకి వెడతాను. లేకపోతే —

పేరుభట్టు — తప్పకుండా — తాళంవెయ్యడం తరవాయి. నువ్వు ముందుకే వెళ్లవచ్చు.

(వెంకటశాస్త్రి వెళ్లిపోతాడు. గదికి తాళంవేసి పేరుభట్టు బయలు దేరతాడు.)

పేరుభట్టు — "ప్రథమకబళే మక్షికాపాతః" ఇలా అయింది మనపని. అయితే ప్రేమకి యింతకంటే యేంవుదాహరణ కావాలీ?......... "రిక్తహస్తేన నోపేయా" త్తన్నాడు. ఇది ఆగ్రహసమయం కూడానూ. బజారునుంచే వెడదాం.

(వెళ్లిపోతాడు.)

(సశేషం)